సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం ♦ 11 ♦ జూన్ ♦ 2023



బైక్‌ల అపహరణ ముఠా అరెస్ట్

పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను అపహరిస్తున్న ముఠాను చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



సమస్యల వలయంలో బస్టాండ్

భువనగిరి బస్టాండ్‌లో సరైన వసతులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్సులు కూడా రావడం లేదు - 9లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40°/26°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

12న ప్రజావాణి రద్దు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో ఈనెల 12న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణిని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ముగిసిన ఫుడ్ ఫెస్టివల్



చేపల వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాల్

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఫుడ్ ఫెస్టివల్ శనివారం ముగిసింది. మత్స్య శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసి వివిధ రకాల చేపల వంటకాలు విక్రయించారు. ఇందుకోసం కనీస ధర రూ.100గా నిర్ణయించారు. చివరి రోజు చేపల పులుసు, బిర్యానీ, కర్రీ, ఫ్రై, కేఎఫ్‌సీ ఫిష్, అపోలో ఫిష్, ఫిష్ ఓడా, ప్రాన్స్ ఫిష్ ఫ్రై, ఫూల్ ఫ్రై ఫ్రిష్, ఎండి చేపల పులుసు వంటకాలు చేశారు.

14 నుంచి కౌన్సిలింగ్

యాదగిరిగుట్ట : ప్రభుత్వ పాలిటెక్నిక్ కలశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 14 నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ షఫియాజ్ అక్తర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు 14నుంచి 18వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. 16నుంచి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. వివరాల కోసం యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు పాలిసెట్–2023 ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, టెన్త్ మార్కుల మెమో, 4నుంచి 10వ తరగతి వరకు విద్యార్హతల ధ్రువీకరణ పత్రం, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో హెల్ప్‌లైన్ సెంటర్‌లో హాజరుకావాలన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, ఆరాధన, నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన గావించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం చేపట్టారు. భక్తులు వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వలిగొండ @43

భువనగిరిటౌన్ : మృగశిర కార్తె వచ్చినా ఎండలు తగ్గుముఖం పట్టడం లేదు. శనివారం జిల్లాలో అత్యధికంగా వలిగొండలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రామన్నపేటలో 42.7, బొమ్మలరామారం 41.3, మోత్కూర్, గుండాల, ఆలేరు, ఆత్మకూర్(ఎం) మండలాల్లో 40.5, భువనగిరిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రత సైతం 39 డిగ్రీలు నమోదు కావడంతో చేరడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం వేడెక్కింది.

చేనేతను విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

మోత్కూరు : లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేయడానికి ఎంపిక చేసిన బీసీ కులాల్లో చేనేతను చేర్చాలని తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మువ్వన్నెల జెండా, అగ్గిపెట్టెలో ఇమిడే చీర నేసిన ఘనత చేనేత కార్మికులదన్నారు. ఆర్థిక సహాయం ప్రకటించిన బీసీ కులాల్లో చేనేతను కూడా చేర్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి పోచం కన్నయ్య, మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు పోచం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గుట్టనా.. సైదాపురమా!

వంద పడకల ఆస్పత్రి నిర్మాణంపై మల్లగుల్లాలు

- ఫిబ్రవరి 16న సైదాపురంలో మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన
- గుట్టకు దూరంగా ఉండడంతో మార్చాలని సూచించిన మంత్రి
- ఇప్పటి వరకు కొలిక్కి రాని స్థలం
- అత్యవసర వైద్యం కోసం రోగుల తిప్పలు



సైదాపురం శివారులోని వైటీడీఏ స్థలంలో శంకుస్థాపన చేసిన చోట శిలాఫలకం

యాదగిరిగుట్ట : వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి అడుగులు పడడం లేదు. యాదగిరిగుట్ట సమీపంలోని సైదాపురం శివారులో ఐదు ఎకరాల స్థలంలో ఫిబ్రవరి 16వ తేదీన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడున్నర నెలలు గడిచినా పనులు ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ప్రతిపాదిత స్థలంలో చిన్న గొయ్యి కూడా తీసిన ఆనవాళ్లు లేవు.

అత్యవసరం వైద్య కోసం ఇతర పట్టణాలకు..

యాదగిరిగుట్ట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అత్యవసర వైద్యం కోసం ఎక్కువగా యాదగిరిగుట్ట పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. కానీ, ఇక్కడ అన్ని రకాల సేవలు అందుబాటులో లేకపోవడంతో భువనగిరికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. యాదగిరిగుట్ట నుంచి భువనగిరి సుమారు 12 కిలో మీటర్ల దూరం ఉంటుంది. పీహెచ్‌సీ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేలోపు చాలా ప్రాణాలు మార్గ మధ్యంలోనే పోతున్నాయి. అంతేకాకుండా హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. క్షతగాత్రులను ఆలేరు లేదా భువనగిరి, హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. అదే యాదగిరిగుట్టలో 100 పడకల ఆస్పత్రి ఉంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎంతో మంది ప్రాణాలు దక్కుతాయి. దీనికి తోడు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో ఈ ప్రాంతంలో వంద పడకల ఆస్పత్రి ఆవశ్యకత తప్పనిసరి అయింది.

ఆలస్యం ఇందుకేనా!

యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం శివారులో సుమారు 5 ఎకరాల స్థలంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. సైదాపురం యాదగిరిగుట్టకు నాలుగు కిలో మీటర్ల దూరం ఉండడంతో పాటు అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఆస్పత్రిని పట్టణానికి దగ్గరగా మార్చాలని మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన రోజు అధికారులకు సూచించారు. అప్పటి నుంచి అధికారులు స్థలం సేకరించే పనిలో ఉన్నారు. కానీ, ఎక్కడ నిర్మించాలనే విషయంపై ఇంకా కొలిక్కి రాలేదు. నిధులు సిద్ధంగా ఉండడంతో ఆరు నెలల్లోనే ఆస్పత్రి నిర్మాణం పూర్తవుతుందని అధికారులు శంకుస్థాపన రోజు చెప్పినా ఇప్పటి వరకు పునాది కూడా తీయలేదు.

త్వరగా ప్రారంభించాలి



సైదాపురంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. అత్యవసర సేవల కోసం భువనగిరి, హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఆలోపే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. నూతన ఆస్పత్రి పనులు త్వరగా ప్రారంభించాలి.

–కోలా వెంకటేష్‌గౌడ్, సైదాపూరం

భువనగిరికి రెఫర్ చేస్తున్నాం



యాదగిరిపల్లి పీహెచ్‌సీకి రోజూ 100 ఓపీ వస్తుంది. ఇక్కడ 6 పడకలు మాత్రమే ఉన్నాయి. అత్యవసర వైద్యం కోసం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపుతున్నాం. 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఉన్నతాధికారులు ఆస్పత్రి నిర్మాణ పనిలోనే ఉన్నారు.

–డాక్టర్ వంశీకృష్ణ, పీహెచ్‌సీ, యాదగిరిపల్లి

ప్రస్తుత పీహెచ్‌సీలో సేవలు ఇలా..

యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని యాదగిరిపల్లిలో 2000 సంవత్సరంలో 6 పడకల ఆస్పత్రి ప్రారంభించారు. అప్పట్లో రోగుల సంఖ్య తక్కువగానే ఉండేది. ప్రస్తుతం రోజూ వందకు పైగానే ఓపీ వస్తుంది. అంతే కాకుండా డెలివరీలు జరుగుతున్నాయి. ఈ ఆస్పత్రిలో 6 పడకలు మాత్రమే ఉండటంతో రోగులకు సరిపోవడం లేదు. ఇక్కడ ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, పీహెచ్ఎన్, సీహెచ్‌వో, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ముగ్గురు స్టాఫ్ నర్స్‌లు విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో ఒక స్టాఫ్ నర్స్, నూట్ వాచ్‌మెన్, ఆయాలు మాత్రమే ఉంటారు. ఎమర్జెన్సీ సమస్య ఉంటే తప్ప మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండరు. అదే ఇక్కడ 100 పడకల ఆస్పత్రి నిర్మాణం జరిగితే ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలతో పాటు స్టాఫ్ క్వాటర్స్, ఎమర్జెన్సీ సర్వీసులు, ల్యాబ్, పోస్టుమార్టం గదులు వంటి వస్తాయనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు, చిత్రంలో డీసీపీ తదితరులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు

భువనగిరి : లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు పేర్కొన్నారు. శనివారం భువనగిరిలోని జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలో గొడవలు పడి కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోవద్దన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయసేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు చేపడుతామని తెలిపారు. డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ రాజీపడదగిన కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. కేసులు రాజీపడ్డ వారు నేరాలకు పాల్పడకుండా ప్రశాంతమైన జీవనం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతిదేవి అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, స్పెషల్ మెజిస్ట్రేట్ జావిద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

9,595 కేసులు పరిష్కారం

లోక్ అదాలత్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 9,595 కేసులు పరిష్కారం అయ్యాయి. ఇందులో సివిల్ కేసులు 10, క్రిమినల్ 9585 ఉన్నాయి. వీటితో పాటు ఎస్‌బీఐ మరియు బీఎస్ఎన్ఎల్ 14, విద్యుత్ శాఖకు సంబంధించి 1559 కేసులు పరిష్కరించారు.

తడిసిన ధాన్యం





మోటకొండూరులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ, తడిసిన వడ్ల బస్తాలు

మోటకొండూర్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ఈదురు గాలులకు వడ్ల కుప్పలపై కప్పిన పరదాలు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసింది. ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు నానా అవస్థలు పడ్డారు. అలాగే పలు చోట్ల వృక్షాలు కూలాయి.మోటకొండూరులో ఉన్నత పాఠశాల, ఎంఈఓ కార్యాలయాల ప్రహరీ గోడ కూలింది.

12 కేంద్రాలు.. 3644 మంది అభ్యర్థులు

- నేడు గ్రూప్ – 1 పరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 10.15 దాటితే అనుమతి నిరాకరణ



భువనగిరిలోని జాగృతి కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

భువనగిరి : జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్–1 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. అభ్యర్థులను ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. 10.15 తర్వాత అనుమతించబోరు. పరీక్షల నిర్వహణకు 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయా సెంటర్లలో 3,644 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరిలో 19 మంది ఉర్దూ మీడియం మిగతా వారు తెలుగు మీడియం అభ్యర్థులు ఉన్నారు. పర్యవేక్షణ కోసం 12 మంది చీఫ్ సూపరింటెండ్లతో పాటు 12 మంది లైజనింగ్ ఆఫీసర్లు, నలుగురు రూట్ ఆఫీసర్లు, నలుగురు ఫ్లెయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. అదనపు కలెక్టర్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు.

పరీక్ష కేంద్రాలివే..


పరీక్ష కోసం భువనగిరి పట్టణంలో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మదర్ థెరిస్సా హైస్కూల్, మాంటిస్సోరీ హైస్కూల్, సెయింట్ ఎలిజబెత్ స్కూల్, ప్రెసిడెన్సీ హైస్కూల్, వెన్నెల కళాశాల, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి డిగ్రీ కళాశాల, కృష్ణవేణి హైస్కూల్, భువనగిరి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల, జాగృతి డిగ్రీ మరియు పీజీ కళాశాల(ఏ,బీ సెంటర్లు), దివ్య బాల విద్యాలయం ఉన్నాయి.

పాటించాల్సిన నిబంధనలు

అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలి. హాల్ టికెట్‌లో తప్పులుదొర్లితే సరిచేసేందుకు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తెచ్చుకోవాలి. బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను మాత్రమే వాడాలి. ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుతించబడవు. షూ కూడా అనుమతించరు. చేతులకు మెహందీ, టాటూలు ఉండకూడదు.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

- వెయ్యి కిలో మీటర్లు పూర్తి చేసుకున్న భట్టి పాదయాత్ర
- దేవరకొండలో కార్నర్ మీటింగ్



సభలో మాట్లాడుతున్న ఎంపీ రంజితా రంజన్ చిత్రంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు తదితరులు

దేవరకొండ : సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిప పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. శనివారం దేవరకొండ మండలంలోని బిచ్చాతండా నుంచి యాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 7.30 గంటలకు దేవరకొండకు చేరుకుంది. శనివారం దేవరకొండ పట్టణానికి చేరుకున్న పాదయాత్రకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని డిండి చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు తరలి వచ్చారు. కార్నర్ మీటింగ్‌కు సంఘీబావం తెలిసేందుకు ఏఐసీసీ సెక్రటరీ, రాజ్యసభ సభ్యురాలు రంజితా రంజన్ హాజరై మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు జానారెడ్డి, శ్రీధర్‌బాబు హాజరై మాట్లాడి కార్యకర్తల్లో జోష్ నింపారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు ప్రసంగం ఆకట్టుకుంది. నేతలందరూ ఓకే వేదిక పైనుంచి మాట్లాడడంతో కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

భట్టి అసహనం

కార్నర్ మీటింగ్‌లో నేతలు ప్రసంగిస్తున్న సమయంలో కొందరు నాయకుల అనుచరులు పేర్లు పెట్టి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేయడంతో.. వేదిక పైనున్న నాయకులు వారిని నిశబ్దంగా ఉండాలని కోరారు. అయినప్పటికీ అదే రీతిలో వ్యవహరించడంతో భట్టి విక్రమార్క అసహనం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలని లేనిపక్షంలో క్రమశిక్షణా రాహిత్యం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పైలాన్ ఆవిష్కరణ

భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకు 30 నియోజకవర్గాల్లో 500లకుపై గ్రామాల్లో పాదయాత్ర కొనసాగింది. ఈనెల 8న నల్లగొండ జిల్లాలో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని నక్కలగండి వద్ద ప్రారంభమైంది. శనివారం దేవరకొండకు చేరుకుంది. పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లకు చేరుకున్న సందర్భంగా కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లిలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆదివారం ఆవిష్కరించనున్నారు. పైలాన్‌కు సంబంధించిన పనులను స్థానిక నాయకులు పూర్తి చేశారు.



దేవరకొండలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

సుపరిపాలనకు నిదర్శనం తెలంగాణ

- అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్
- ఎదురించిన చేతులే హారతి పడుతున్నాయి
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై ప్రభుత్వ విప్ సునీత, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి : సుపరిపాలనకు తెలంగాణ నిదర్శనం అని, స్వరాష్ట్రంలో అన్ని రంగాల్లో దూసుకుపోతూ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికేంద్రీకరణతో పాలనను ప్రజల చెంతకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. నూతన రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్కువగా ప్రయోజనం పొందిందన్నారు. ఉమ్మడి నల్లగొండలో ఉన్నప్పుడు కూడా భువనగిరి జిల్లా ప్రజలు ఎక్కువగా రంగారెడ్డి, హైదరాబాద్‌తో సత్సంబంధాలు కొనసాగించే వారని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంగా ఉన్నప్పుడు దూరభారం ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, జిల్లా జడ్జికి హైదరాబాద్ నుంచి ప్రతి రోజూ ఆర్టీసీ బస్సులో మంచినీటి క్యాన్లు వచ్చేవని గుర్తుచేశారు. జిల్లా అభివృద్ధిలో అధికారుల పాత్ర అమోఘమని ప్రశంసించారు. 2014కు ముందు విద్యుత్ శాఖపై పిడికిలెత్తిన చేతులే దశాబ్ది ఉత్సవాల్లో హారుతులు పడుతున్నాయన్నారు. ప్రజలు, అధికారులు సంయుక్తంగా తాము సాధించిన విజయాలను ఉత్సవాలుగా నిర్వహించుకోవడం తెలంగాణలోనే జరుగుతుందన్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు రాష్ట్ర ప్రగతిని సూచిస్తున్నాయన్నారు. చేపల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు.

ప్రజల చెంతకే పాలన : పైళ్ల శేఖర్‌రెడ్డి

ఒకప్పుడు కలెక్టరు, ఎస్పీలను కలవాలంటే సాధ్యమయ్యేది కాదని, ఇప్పుడ అటువంటి పరిస్థితి లేదని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. వికేంద్రీకరణతో ప్రజలకు పాలన చేరువైందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సాహసోపేత నిర్ణయాలు మతీసుకొని ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన సాయినగర్‌వంటి చిన్న గ్రామ పంచాయతీలు కూడా అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని తెలిపారు. భువనగిరి జిల్లా అవుతుందని కలలో కూడా ఊహించలేదని, కేసీఆర్ ఆలోచనలతో అది సాధ్యమైందన్నారు.

ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుపుదాం : గొంగిడి సునీత

ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా దూసుకుపోతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ఇక్కడి అభివృద్ధిని చూసి ఇతర రాష్ట్రాల సర్పంచ్‌లు కూడా కొనియాడుతున్నారని పేర్కొన్నారు. దేశంలోనే కాదు.. ప్రపంచంలోనూ తెలంగాణను నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామన్నారు. ఒకప్పుడు ప్రభుత్వం అంటే ఎక్కడ ఉంటదో అనుకునే వారని, ఇప్పుడు ఫోన్ ద్వారా ఒక్క మెసేజ్ పంపితే కలెక్టర్‌తో సహా అధికారులు వెంటనే స్పందిస్తున్నారని తెలిపారు.

జిల్లా ఏర్పాటులో మంత్రి పాత్ర కీలకం : గాదరి కిశోర్‌కుమార్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలను సీఎం కేసీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పాటులో మంత్రి జగదీశ్‌రెడ్డి పాత్ర కీలకమన్నారు. నూతన జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో ప్రజలకు పాలన చేరువైందన్నారు. గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయితే వరి దిగుబడి గణనీయంగా పెరగుతుందన్నారు. భువనగిరి మున్సిపాలిటీ ఆదర్శంగా రూపుదిద్దుకుంటుందన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మీసేవ సెంటర్ నిర్వాహకుడు సజ్జన్‌లాల్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


పారదర్శకంగా భూముల రిజిస్ట్రేషన్లు : కలెక్టర్

ధరణి వచ్చిన తర్వాత భూముల రిజిస్ట్రేషన్లలో పారదర్శకత పెరిగిందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. తహసీల్దార్లు జాయింట్ రిజిస్ట్రార్లుగా అద్భుతంగా సేవలందిస్తున్నారని కితాబునిచ్చారు. జిల్లాలో కొత్తగా 87 పంచాయితీలు ఏర్పాటయ్యాయని, ఇందులో 37 తండాలు ఉన్నాయని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల్లో పూడికతీత ద్వారా 6 మీటర్ల మేర భూగర్భ జలాలు వృద్ధి చెందాయన్నారు. 421 గ్రామ పంచాయతీల్లో 350 చెరువులు నీటితో కళకళలాడుతున్నాయని చెప్పారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మీ సేవ నిర్వాహకులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కంచర్ల రామకష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, భువనగిరి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్లు ఆంజనేయులు, వెన్‌రెడ్డి రాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అమరేందర్ గౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కొలుపుల అమరేందర్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఎంపీపీలు జెడ్పీటీసీలు, వివిధ సంఘాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వృత్తిదారులకు సాయం..ఎన్నికల స్టంట్

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : కుల, చేతి వృత్తిదారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించడం.. ఎన్నికల స్టంట్ అని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబానికి తప్పా.. ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదన్నారు. గత ఎన్నికల ముందు కూడా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న బీసీల విషయం ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట ధాన్యం కొనుగోళ్లను విస్మరించిందన్నారు. ఇంకా 50 శాతం వడ్లను కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో బిల్లులు కూడా చెల్లించడం లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేశాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బీసుకుంట్ల సత్యానారాయణ, కుక్కదువ్వ సోమయ్య, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

బావిలో పడి యువకుడు మృతి

చింతపల్లి : బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని వర్కాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన ప్రకారం..డిండి మండలం బొగ్గులదోన గ్రామానికి చెందిన వేముల రాజు(18) నాలుగు రోజుల క్రితం చింతపల్లి మండల కేంద్రంలోని మేనమామ తిరుపతయ్య ఇంటికి వచ్చాడు. ఈ తరుణంలోనే శనివారం ఉదయం 10 గంటల సమయంలో వర్కాల సమీపంలో ఈత కొట్టేందుకు ముగ్గురు యువకులతో కలిసి బావిలోకి దిగారు. ఈ క్రమంలో బావిపై నుంచి రాజు నీటిలోకి దూకడంతో రాయికి తగిలి మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బావిలో నుంచి వెలికితీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

చివ్వెంల : గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చందుపట్ల గ్రామానికి చెందిన కాసాని మహేష్ (23) శుక్రవారం రాత్రి పనుల నిమిత్తం బైక్‌పై మోతె మండలం సిరికొండ గ్రామానికి వెళ్తున్నాడు. చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ.విష్ణుమూర్తి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం ఢీకొని..

నిడమనూరు: రోడ్డుపై నిలిచున్న బైక్‌ను డీసీఎం ఢీకొనడంతో ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన నిడమనూ మండలంలోని తుమ్మడం కొటమైసమ్మ ఆలయం సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడకు చెందిన పాలడుగు మురళికార్తికేయ (16) శనివారం తన బంధువు ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు వచ్చాడు. కార్తికేయ చికెన్ ముటను బైక్‌పై పెట్టుకుని రోడ్డు పక్కన నిల్చున్నాడు. ఈ క్రమంలో ధన్‌సింగ్ తండా నుంచి హైదరాబాద్‌కు ఖాళీ సీసాల లోడుతో వేగంగా వెళ్తున్న డీసీఎం కార్తికేయను ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. అనంతరం అతడి పైనుంచి డీసీఎం చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి పాలడుగు నాగరాజు ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

ఎగిరి ఢీకొడుతున్నాయ్..!

- చిట్యాల మండల పరిధిలో హైవేపై తరచూ ప్రమాదాలు
- నెలరోజుల వ్యవధిలోనే నలుగురి దుర్మరణం
- అతివేగమే ప్రధాన కారణం
- స్పీడ్‌గన్స్ ఉన్నా వేగంలో తగ్గేదేలే అంటున్న వాహనదారులు
- ప్రమాదాలతో హడలిపోతున్న ప్రయాణికులు


పెద్దకాపర్తి శివారులో డివైడర్ మధ్యలో బోల్తాకొట్టిన కారు(ఫైల్)


వెలిమినేడు శివారు పిట్టంపల్లి రోడ్డు క్రాసింగ్‌లో డివైడర్ మధ్యలో దగ్ధమవుతున్న కారు(ఫైల్)

చిట్యాల: సాధారణంగా రహదారులపై వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకుంటాయి. కానీ, చిట్యాల మండల పరిధిలో ఫోర్‌వే లేన్‌గా ఉన్న జాతీయ రహదారిపై ఇటీవల కాలంలో పలు చోట్ల వాహనాలు అతి వేగంగా ప్రయాణిస్తూ ఒక వైపు లేన్ వేలో ప్రయాణిస్తూ డివైడర్‌లను ఢీకొని మరో లేన్ వేలో వస్తున్న వాహనాలను ఢీకొడుతున్నాయ్. ఇటీవల ఇలాంటి ప్రమాదాలు వరుసగా జరుగుతుండటంతో ప్రయాణికులు హడలిపోతున్నారు.

డివైడర్‌లను ఢీకొని..

చిట్యాల మండల పరిధిలోని పెద్దకాపర్తి, వెలిమినేడు, గుండ్రాంపల్లి గ్రామాల పరిధిలో వాహనాలు అతివేగంగా ప్రయాణిస్తూ అదుపుతప్పి డివైడర్‌లను ఢీకొని వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా జరుగుతున్న ప్రమాదంలో ఒకవైపు లేన్‌వేలోంచి వెళ్తున్న వాహనాలు అతివేగంగా డివైడర్‌లను ఢీకొని మరో వైపు లేన్‌వేలోకి ఎగిరి పడి వాహనాలు ఢీకొడుతున్నాయి. దీంతో ఇలా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇరవై ఐదు రోజుల వ్యవధిలో నలుగురు మృతిచెందారు. గత మే 14న విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు మండలంలోని పెద్దకాపర్తి శివారులోని సెవన్ హోటల్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఎగిరి హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు మృతిచెందాడు. ఈ నెల 7న రాత్రి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలో అండర్‌పాస్ దాటిన తర్వాత జాతీయ రహదారిపై సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న కారును ఓవర్‌టెక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టి అతివేగంగా పైకి లేచి ఎగిరి హైదరాబాద్ నుంచి వస్తున్న రెండు లారీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతిచెందారు. అంతేకాకుండా గత ఆరు నెలల కాలంలో పెద్దకాపర్తి గ్రామ శివారులోని గాంధీ గుడి సమీపంలో ఇదే తరహాలో పలు ప్రమాదాలు చోటు చేసుకుని వాహనాలు దగ్ధమయ్యాయి.

ప్రమాదాల నివారణ ఇలా..

- బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించిన చోట వాహనదారులకు కనిపించే విధంగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.
- అతివేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించేందుకు స్పీడ్‌గన్‌లను ఏర్పాటు చేయాలి.
- గతంలో జాతీయ రహదారిపై అతివేగంగా వెళుతున్న వాహనాలను, రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఇంటర్‌సెప్టార్(స్పీడ్ గన్ గల్గిన) వాహనాలను తిరిగి ఏర్పాటు చేయాలి.
- జాతీయ రహదారిపై పెట్రోలింగ్ చేసే వాహనాలను పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేయాలి.
- హేవేపై ప్రతిరోజు లారీల్లో ఇసుక రవాణా జరుగుతుంది. ఆ లారీల నుంచి జారిపడిన ఇసుక రోడ్డుకిరువైపులా పేరుకుపోతుంది. దీంతో ఇసుకలో వాహనాదారులు బ్రేక్ వేసినప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై పెరుకుపోయిన ఇసుకను వెంట వెంటనే తొలగించాలి.
- ప్రమాదకర మూల మలుపులుగా ఉన్న పెద్దకాపర్తి గాంధీ గుడి, వెలిమినేడు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని రోడ్డుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.
- పరిమితికి మించి వేగంగా వెళుతున్న వాహనాల డ్రైవర్‌లను గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలి.

బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం



చిట్యాల మండల పరిధిలోని జాతీయ రహదారి ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్ లుగా గుర్తించాం. ఇటీవల కాలంలో వాహనాలు అతివేగంగా, ముందువెళుతున్న వాహనాలను ఓవర్ టేక్ చేయబోయి, డివైడర్‌లను ఢీకొంటూ మరోవైపు లేన్‌లోని వాహనాలపై ఎగిరిపడి ఢీకొడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనల మేరకు వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, స్టాపర్‌లను ఏర్పాటు చేయనున్నాం.

– శివరాంరెడ్డి. సీఐ

ప్రమాదాలకు కారణాలివే..

- వాహనాలు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా అతివేగంగా వంద కి.మీ వేగానికి మించి ప్రయాణించడమే కారణంగా తెలుస్తోంది.
- జాతీయ రహదారిపై రోడ్డు అంచుల వెంట ఇసుక పెరుకుపోవటంతో అతివేగంగా వెళ్లే వాహనాలు వేగాన్ని అదుపు చేసేందుకుగాను డ్రైవర్‌లు బ్రేక్ వేసినప్పుడు అదుపుతప్పి డివైడర్‌లను ఢీకొంటున్నాయి.
- పెద్దకాపర్తి అండర్ పాస్, వెలిమినేడు గ్రామ శివారులోని పిట్టంపల్లి గ్రామానికి క్రాసింగ్ వద్ద హైవేపై క్రాసింగ్‌లతో పాటు అండర్ పాస్ ఉండడంతో రహదారి కాస్తా పెద్దగా ఉంటుంది. ఈ రోడ్డుపై వాహనాలు ముందు వెళుతున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌లను ఢీకొడుతున్నాయి.

బైక్‌ల అపహరణ ముఠా అరెస్ట్

- చౌటుప్పల్ పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులు.. పరారీలో మరొకరు
- జల్సాల కోసమే చోరీలు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మొగిలయ్య


సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మొగిలయ్య

చౌటుప్పల్ : ఇల్లు, దుకాణాల ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌లను అపహరిస్తున్న ముఠాను చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం తన కార్యాలయంలో పట్టుబడిన నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఏసీపీ మొగిలయ్య వివరాలు వెల్లడించారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహంకాళి మల్లేష్, రాపోలు కిరణ్, రాపోలు నర్సింహ, మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన సంపంగి శివ కూలీ పనులు చేస్తుంటారు. ఒకే కులం, ఒకే వృత్తి కావడంతో వీరి నడుమ దగ్గరి సంబంధాలు ఉన్నాయి. కూలి పని చేయగా వచ్చే డబ్బుతో వారి వ్యసనాలు, కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. ఫలితంగా ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో తక్కువ సమయంలోనే అధికంగా డబ్బులు సంపాదించే మార్గాలపై దృష్టిసారించారు. ఆ క్రమంలో ద్విచక్రవాహనాలను దొంగతనం చేసి అమ్ముకోవడం ద్వారా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని నలుగురు నిర్ణయానికి వచ్చారు. అనుకున్నట్టుగానే పథకాన్ని అమల్లోపెట్టి బైకుల దొంగతనానికి పాల్పడ్డారు.

అమ్మేందుకు హైదరాబాద్‌కు వెళ్తుండగా..

దొంగతనం చేసిన బైకులను ఎవరికి అనుమానం రాకుండా గుట్టుగా దాచిపెట్టారు. అదును చూసి విక్రయించాలని నిర్ణయించారు. అందులో భాగంగా శనివారం మహంకాళి మల్లేష్, రాపోలు కిరణ్, రాపోలు నర్సింహ రెండు బైకులను దాచిపెట్టిన ప్రాంతం నుంచి బయటకు తీశారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లి అమ్ముకోవాలని ముగ్గురు కలిసి బైకులపై బయలుదేరారు. పట్టణ కేంద్రంలోని వలిగొండ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు నంబర్‌ప్లేట్లు లేని ఈ రెండు బైకులపై అనుమానం కలిగింది. దీంతో వారిని ఆపి పత్రాలు చూపించమనగా వారి దొంగతనం గుట్టురట్టయ్యింది. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాల వివరాలు వెల్లడించారు. అంకిరెడ్డిగూడెంలో దాచిపెట్టిన మరో మూడు బైకులను సైతం తీసుకువచ్చారు. పట్టుబడిన బైకుల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సంపంగి శివ పరారీలో ఉన్నాడు. బైకుల దొంగతనాల కేసును ఛేదించిన టీం సభ్యులకు రివార్డులు అందిస్తామని ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ ఎస్.దేవేందర్, ఎస్‌ఐ అనిల్, సిబ్బంది, ఉన్నారు.

మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో..

ముఠాగా ఏర్పడిన ఈ యువకులు ఇటీవల రాచకొండ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు బైకులను దొంగిలించారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పల్సర్ బైకు, భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్యాషన్ ప్రో, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు 150 సీసీ పల్సర్ బైకులు, మరో పల్సర్ ఎత్తుకెళ్లారు. వేర్వేరు చోట్ల వేర్వేరు సమయాల్లో దొంగతనం చేసిన ఈ ఐదు బైకులను మహంకాళి మల్లేష్ ఇంట్లో దాచిపెట్టారు.


పట్టుబడిన ద్విచక్రవాహనాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు


నార్కట్‌పల్లిలో క్రేన్ సహాయంతో లారీని తొలగిస్తున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. పెద్దడిశర్లపల్లి , నార్కట్‌పల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో నివాసముంటున్న ముత్తంగి శ్రీను తన కుటుంబ సభ్యులతో కలిసి కనిగిరి మండలం శంకారం గ్రామంలో శుభకార్యానికి వెళ్లి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో పెద్దఅడిశర్లపల్లి మండలం ఘనపురం స్టేజి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న శ్రీనుతో పాటు అతని కుటుంబసభ్యులు నలుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. శ్రీను తండ్రి చిన్న కామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

లారీ బోల్తా పడి..

నార్కట్‌పల్లి : జాతీయ రహదారిపై లారీ బోల్తా పడడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ మార్గమధ్యలో నార్కట్‌పల్లి సమీపంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆర్చి వద్దకు వచ్చే సరికి డ్రైవర్‌కు నిద్ర మత్తులోకి జారుకోవడంతో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. లారీ రోడ్డుపై పడిపోవడంతో దాదాపు కిలో మీటర్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదబాబు తెలిపారు.

ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో..


హైవేపై లారీని తొలగిస్తున్న ప్రయాణికులు

కట్టంగూర్ : మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాదు నుంచి సూర్యాపేటకు వెళుతుండగా మార్గమధ్యలో కట్టంగూర్ పోలీసు స్టేషన్ వద్దకు రాగానే టైర్ పంక్చర్ కావడంతో హైవేపై డ్రైవర్ ఆపాడు. అదే సమయంలో సూర్యాపేట డిపోకు చెందిన మరో బస్సు డ్రైవర్ గమనించి పక్కకు ఆపాడు. ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. లారీ వెనకాల వస్తున్న బొలేరో ట్రాలీ వాహనం లారీని తప్పించబోయి హైవే అవతలి వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బొలేరోలో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సులో వెనక సీట్లో ఉన్న ఇద్దరు చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ డ్రైవర్ బ్రేక్ వేయటంతో హైవేకు అడ్డుగా తిరిగి ఇంజన్ ఆగిపోయింది. మళ్లీ స్టార్ట్ కాకపోవటంతో 2 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ప్రయాణికలు లారీని వెనక్కి నెట్టండంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

ప్రమాదవశాత్తు ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధం

- పరుగులు తీసిన పెళ్లి బృందం


కాలిపోతున్న ప్రైవేట్ స్కూల్ బస్సు

నేలకొండపల్లి: పెళ్లి వేడుక ముగించుకుని ప్రైవేట్ స్కూల్ బస్సులో ఇంటికి వెళ్తుండగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో బస్సు కాలిపోగా, డ్రైవర్ అప్రమత్తతతో ముప్పై మంది సురక్షితంగా బయటపడ్డారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలానికి చెందిన దాదాపు 30 మంది ఓ ప్రైవేట్ బస్సులో వివాహ రిసెప్షన్ కోసం శనివారం ఖమ్మం వచ్చారు. తిరుగు ప్రయాణంలో నేలకొండపల్లిలోని కట్టలమ్మ చెరువు వద్దకు రాగానే బస్సులో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో డ్రైవర్ రమేష్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపాడు. ఇంతలోనే పెళ్లి బృందం సభ్యులు అరుపులు, కేకలతో బస్సు దిగి పరుగులు తీశారు. అందరూ కిందకు దిగాక మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే, ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చినా ఖమ్మం మార్కెట్‌లో జరిగిన ప్రమాద స్థలి వద్దకు వెళ్లడంతో వాహనం రాలేదు. నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, కార్యదర్శి దేవేందర్ చొరవ తీసుకుని పంచాయతీ వాటర్ ట్యాంకర్ పంపించగా పోలీసులు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

బీబీనగర్: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో పుస్తెల తాడును అపహరించుకుపోయారు. ఈ ఘటన బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు గ్రామానికి చెందిన దంతూరి వాణి గ్రామ పంచాయతీ వద్ద గల అంగన్‌వాడీ కేంద్రం నుంచి కోడిగుడ్లను తీసుకొని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఇద్దరు దుండగులు తన వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని 4తులాల పుస్తెలతాడు లాక్కొని పారిపోయారు. ఈ క్రమంలో వాణి రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాల సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేంధర్ తెలిపారు.

పోలీసులకు దొంగ అప్పగింత

రామన్నపేట : వ్యవసాయబావుల వద్ద కేబుల్‌వైర్లను అపహరిస్తున్న దొంగను రామన్నపేటకు చెందిన రైతులు శనివారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రెవెన్యూశాఖలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న మేడి లక్ష్మణ్ జనంపల్లికి గ్రామానికి వెళ్లే దారిలో జూకంటి బీరప్ప వ్యవసాయబావి వద్ద కేబుల్‌వైర్ కట్‌చేసి చుట్టుకొని పోతుండగా రైతు కుమారుడు మహేష్ గమనించి వెంబడించాడు. చేతిలోని కేబుల్ వైరును పక్కనే ఉన్న వ్యవసాయబావిలో పడేసి పారిపోతుండగా అతనితోపాటు మరికొందరు రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.లక్ష్మయ్య తెలిపారు.


రైతులు బంధించిన వీఆర్‌ఏ లక్ష్మణ్

ఒకరి దుర్మరణం

నాగార్జునసాగర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలో శనివారం వెలుగులోవచ్చింది. సాగర్‌లోని పైలాన్ కాలనీకి చెందిన ఉదయ్(23) శుక్రవారం రాత్రి హిల్‌కాలనీలో మెకానిక్ ఫంక్షన్‌కు హాజరై బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో అతివేగంగా వచ్చి రోడ్డు వెంట గల బోర్డును ఢీకొట్టడంతో బైకుమీద నుంచి కిందపడి మృతి చెందాడు. ఆయన సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో నిర్మానుష్య ప్రాంతంలో ఒంటిపై దుస్తులు లేని సుమారు(40) సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండ్రోజుల క్రితమే వ్యక్తి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు మతిస్థిమితం సరిగా లేని యాచకుడిగా అనుమానిస్తున్నారు.

కనగల్‌లో గాలివాన బీభత్సం

- విరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల వాహనాలు ధ్వంసం
- లేచిపోయిన ఇళ్ల పైకప్పులు.. భారీగా ఆస్తినష్టం


కనగల్ క్రాస్‌రోడ్డులో లేచిపోయిన రేకుల షెడ్డు

కనగల్: కనగల్ మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం గాలివాన బీభత్సం సష్టించింది. ఆయా గ్రామాల్లో గాలివాన ధాటికి పలు గ్రామాల్లోని ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. శాబ్దుల్లాపురంలో మెయిల్‌లైన్ కరెంట్‌పోళ్లు కూలిపోవడంతో వైర్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. ఇదే గ్రామానికి చెందిన సోము ముత్యాలు ఇల్లు కూలిపోయింది. కనగల్ మండల కేంద్రానికి చెందిన ఏటేల్లి నాగేందర్‌కు చెందిన ట్రాక్టర్ ఇంజన్‌పై భారీ వక్షం పడటంతో ధ్వంసం అయ్యింది. అదేవిధంగా కనగల్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ఓ రేకుల షెడ్డు భారీ గాలికి కొట్టుకుపోయి పరిసర ప్రాంతాల్లో చెల్లచెదురుగా పడ్డాయి. పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న హోటల్ వద్ద భారీ వేప చెట్టు కూలిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. చెట్టు కూలిపోవడంతో ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. దీంతో పాటు ఆయా గ్రామాల్లో భారీ వృక్షాలు, ఇంటిపై కప్పు రేకులు లేచిపోయాయి. పలుచోట్ల కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పోళ్లు, రేకుల ఇండ్లు, షెడ్లు ధ్వంసం అయ్యాయి.


కనగల్‌లో కిందపడిన ట్రాన్స్‌ఫార్మర్


కనగల్‌లో బైక్‌లపై కూలిన వేపచెట్టు

యాదాద్రి కొండపై భక్తుల ఇక్కట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపై శనివారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తలదాచుకునేందుకు సరైన చోటు లేకపోవడంతో తడస్తూనే ఉరుకులు పరుగులు తీశారు.


యాదాద్రిలో ఆకాశంలో మెరుపులు వచ్చిన దృశ్యం

గాయపడిన వ్యక్తి మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. హైదరాబాద్‌లోని ముషరంబాగ్‌కు చెందిన పత్వారా దశరథ (43) ఈ నెల 9న చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని గాంధీగుడి వద్దకు నడుచుకుంటూ వచ్చాడు. కాగా, ఇదే సమయంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథకు తీవ్ర గాయలవగా నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దశరథ శనివారం మృతి చెందాడు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

చిట్యాల: మానసిక స్థితి సరిగా లేని ఓ వివాహిత ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. చిట్యాల మండలంలోని ఉరుమడ్ల లో కారోబార్‌గా పనిచేస్తున్న బలిజ అరుణ్‌కుమార్ భార్య మమత(31) కొద్ది రోజులుగా మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతోంది. కాగా, శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.